www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్

మైక్రో బయాలజీ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప సిటీ

తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి 28వ మైక్రో బయాలజీ విజ్ఞాన సదస్సు-2025 ఈనెల 10, 11వ తేదీలలో హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) మైక్రో బయాలజీ పీజీ విద్యార్థులు డాక్టర్ దావూద్ సుహేల్ పెద్దగా విభాగంలో ద్వితీయ స్థానం, మొదటి డాక్టర్ మైథిలి జనరల్ క్రిటికల్ థింకింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. వీరిని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి జమున, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, మైక్రోబయాలజీ హెచ్ఒడి డాక్టర్ బి.నాగశ్రీలత సమక్షంలో ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జరగబోయే సదస్సులు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరచి కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రతిష్టను నలు దిశల వ్యాపించేలా కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు.

వారంలోగా కబ్జా భూమిని అప్పగించకపోతే

మేమే స్వాధీనం చేసుకుంటాం

- 20న తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- రిలే నిరాహార దీక్షల్లో వ్య.కా.స. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని నాయనపల్లె 217.129 సర్వే నెంబర్లలో వందలాది ఎకరాలు రాజకీయ నాయకుల చేతుల్లో ఉందని, దానిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని, లేకపోతే తామే స్వాధీనం చేసుకుంటామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వందలాది పేదలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దీక్షపరులకు పూలదండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాలు రాజకీయ నాయకులు, భూ కబ్జాదారులు అక్రమంగా రాత్రికి రాత్రి భూమి చదును చేసుకుని దొంగ ట్రాన్స్ ఫార్మర్లు బిగించి కబ్జా చేశారన్నారు. భూములను పేదలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశార.ు వారం రోజుల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న పేదలకు కచ్చితమైన హామీని రెవెన్యూ అధికారులు ఇవ్వకపోతే ఈనెల 20న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అక్కిమ్‌గుండ్ల రెవెన్యూ పొలంలో మండలంలోని ఆమగంపల్లె, ఇటుకలపాడు, వరికుంట్ల, సావిశెట్టిపల్లె, నాయన పల్లె కోడిగుడ్లపాడు బాలాయపల్లె గ్రామాల పేదలు పదేళ్ల నుంచి భూమి సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వాటికి కూడా పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మూడు నెలల కిందట ఈ ప్రాంత పేద ప్రజలు భూమి కావాలని తహశీల్దార్‌కు 400 అర్జీలు సమర్పించార్నఅ్నరు. వాటిపై నేటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. రెవెన్యూ అధికారులు పేదలకు కోసం విధులు నిర్వహిస్తారా లేక రాజకీయనాయకులకు, భూ కబ్జాదారులకు ఊడిగం చేస్తారా అని తేల్చి చెప్పాలని ప్రశ్నించారు.

దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్య.కా.స. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

అధికారుల వ్యవహారం ఇలా కొనసాగితే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు చేసి అయిన పేదలకు న్యాయం చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. నాయనపల్లె రెవెన్యూ పొలంలో దాదాపు 800 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అందులో కాశినాయన మండల పేద ప్రజలు ఎకరా భూమి గతంలో సాగు చేసుకుంటుంటే అప్పటి రెవెన్యూ అధికారులు పోలీసులను పంపించి వారి సాగును అడ్డుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు ఒక్కొక్కరు వందల ఎకరాలు ఎలా సాగు చేసుకొని ఇచ్చారని వారు ప్రశ్నించారు. డోజర్లు, మిషన్లతో పని చేస్తుంటే రెవెన్యూ అధికారులకు కనపడలేదా అని, పేదలు కంప కొట్టుకొని సాగు చేసుకుంటే వారిని అడ్డుకొని కేసు నమోదు చేస్తామని బెదిరించారన్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులు పేదలకు న్యాయం చేసి భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం అవుతుందని హెచ్చరించారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ పేదలు తినడానికి తిండి లేక అలమటిస్తూ పదేళ్లుగా అక్కిమ్ గుండ్ల రెవెన్యూ పొలంలో భూములు సాగు చేసుకుంటే ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదు అన్నారు. నాయనపల్లెలో వందల ఎకరాలు భూమి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో వ్యవసాయ కార్య సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎంబడి పోలయ్య, మండల కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున మండలంలోని పేద ప్రజలు పాల్గొన్నారు.

విషాదం..!

- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- ముగ్గురు రైలు కిందపడి బలవన్మరణం
- గుండెపోటుతో వృద్ధురాలు..
- ఆత్మహత్యపై కేసు నమోదు చేసిన రైల్వేపోలీసులు

మృతుల ఇంటి వద్ద విచారంలో బంధువులు

ఆత్మహత్య చేసుకున్న శ్రీరాములు, శిరీష, చిన్నారి రిత్విక్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడప

నగరంలోని శంకరాపురం ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు కొన్ని గంటల వ్యవధిలోనే నలుగురు నిండు ప్రాణాలను కోల్పోయారు. వీరిలో వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ (71) గుండెపోటుకు గురికాగా, వృద్ధురాలి మనవడు, మనవరాలు, ముని మనవడితో సహా కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. కడప నగరంలోని శంకరాపురంలో ధోనిపర్తి శ్రీరాములు, వెంకట సుబ్బమ్మ వృద్ధ దంపతులు. వీరి కుమారుడు రామకృష్ణకు రవళి, శ్రీరాములు (27) ఇద్దరు సంతానం. శ్రీరాములు మూడేళ్ల కిందట మృత్యుంజయకుంటకు చెందిన శిరీష (23)ను వివాహమాడాడు. వీరికి రిత్విక్ (ఏడాదిన్నర) అనే ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడు. శ్రీరాములు చెన్నూరు బస్టాండ్ సమీపంలో ఉన్న ఫార్మసీ విభాగంలో విధులను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9:30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో మద్యం సేవించి వచ్చినందుకు కుటుంబ సభ్యులు, పెద్దలు శ్రీరాములను మందలించారు. దీంతో అతను తన బెడ్ రూమ్‌లోకి వెళ్లి తన భార్య శిరీష, కుమారుడుతో సహా వంద రూపాయలు అడిగి ఇప్పించుకుని ఆటోలో బయటకు వెళ్లిపోయారు. వీధి చివరన ఓ స్నేహితుడు పలకరించి ఎక్కడికి వెళుతున్నావని ప్రశ్నించగా రైల్వే స్టేషన్‌కు పోతున్నామని చెప్పాడు. దీంతో సదరు వ్యక్తి శ్రీరాములు కుటుంబ సభ్యులకు ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలో ఆందోళనకు గురై, అప్పటికే తీవ్ర అనారోగ్యంతో ఉన్న శ్రీరాములు నానమ్మ గుండెపోటు గురై ఆకస్మిక మృతి చెందింది. మరోవైపు శ్రీరాములు, శిరీష , రిత్విక్ ముగ్గురు కలిసి ఇంటి దగ్గర నుంచి ఆటోలో వెళ్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే స్టేషన్ కడప నుంచి కమలాపురం వైపు 50 మీటర్ల దూరంలో నడుచుకుంటూ వెళ్లారు. రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని గూడ్స్ రైలు రాగానే పైన పడుకుని మూకుమ్మడిగా ఆత్మహత్య పాల్పడ్డారు. ఏడాదిన్నర వయసున్న రిత్విక్ కూడా వారితోపాటు మరణించడం మరింత విషాదాన్ని నెలకొల్పింది. ఒకే కుటుంబంలో నాలుగు మరణాలు కొన్ని గంటలలోపే జరగడం విషాదం. ఆత్మహత్యకు పాల్పడిన ముగ్గురు మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కడప రైల్వే సిఐ సుధాకర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చంద్రబాబు, లోకేష్‌కు లాభాలు చేకూర్చేందుకే

నకిలీ మద్యం వ్యాపారం

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ఎక్సైజ్ శాఖాధికారికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి - కడప

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు లాభాలు తెచ్చేందుకు కోసమే నకిలీ మద్యం వ్యాపారం రాష్ట్రంలో కొనసాగుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్ బాబు, ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్ బేగం అన్నారు. సోమవారం కడప నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో టిడిపి నాయకులు తయారు చేసిన నకిలీ లిక్కర్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చనిపోతున్నారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. కల్తీ మద్యంపై సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం విషయంలో అడ్డంగా దొరికిపోయిన కూడా చంద్రబాబు నాయుడు నోరు మెదపడం లేదని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ పత్తా లేకుండా పోయారని అన్నారు. జనసేన అధినేతగా ప్రజలకు సేవ చేస్తానన్న పవన్ కల్యాణ్, నిజంగా ప్రజల జీవితాలు బలైపోతున్నా ఈ విషయంలో మాత్రం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. సినిమాల్లో డైలాగులు చెప్పినంతే రాజకీయం కాదని, ఇదే నిజమైన పరీక్ష అని విమర్శించారు. కల్తీ మద్యం వెనుక ఉన్న రాజకీయ మాఫియాను బయటపెట్టి తీరతాం అన్నారు. ఇది సామాన్య నేరం కాదు, ఇది ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న జనహత్య అని దీని వెనుక ఉన్న రాజకీయ మాఫియాను, బయటపెట్టి, శిక్షింపజేస్తాం అని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కో - ఆప్షన్ సభ్యులు, జిల్లా, నగర అనుబంధ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** అన్నమయ్య జిల్లాలో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం తయారీ కుంభకోణంపై వైసిపి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పులివెందుల పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పాత ఆర్‌టిసి బస్టాండ్ వరకు కొనసాగింది. వైఎస్ఆర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజా ప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి అంబకపల్లి రోడ్డు లోని మినీ సెక్రటేరియట్‌లో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సిఐ చెన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. **ప్రొద్దుటూరు :** రాష్ట్రంలో మద్యం సేవించడం అంటే డబ్బులు ఇచ్చి విషం కొనుక్కున్నట్లుందని వైసిపి అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో లభిస్తున్న నకిలీ మద్యానికి నిరసనగా సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక మున్సిపల్ పార్కు నుండి గాంధీ రోడ్డు మీదుగా ఎక్సైజ్ కార్యాలయం వరకు చేరకుని ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి రవీంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కన్నెలూరులో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి రిషికేశవరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, లోగిడి జయన్న, కన్నెలూరు గురుమూర్తి యాదవ్, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ పోచిరెడ్డి, శివ గురివి రెడ్డి, వైసిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మురుగునీటిని తొలగించాలని నిరసన

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని 49వ డివిజన్ అలంఖాన్‌పల్లి పరిధిలో ఉన్న దస్తగిరిపేటలో శ్మశానం నుంచి వచ్చే మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కమిషనర్, మేయర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ దస్తగిరిపేట ఏర్పడి 40 ఏళ్లు అవుతుందని, ఈ ప్రాంతం ప్రజలు అన్ని రకాల పన్నులు కడుతున్నారని, ఈ ప్రాంతం పట్ల కార్పొరేషన్, పాలకవర్గం అభివృద్ధిలో వివక్ష చూపడం సరైనది కాదని తెలిపారు. దస్తగిరిపేట పక్కనే శ్మశాన వాటిక ఉందని, అక్కడ నుంచి మురుగునీరు దస్తగిరిపేటలో ప్రవహించడం వల్ల పాములు, విష పురుగులు, ఇళ్లల్లోకి వస్తున్నాయని చెప్పారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి నెల లోపల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. శ్మశాన వాటిక నుంచి వరద కాలువ నిర్మించి రాళ్ల వంకలో కలుపుతామని పేర్కొన్నారు. అందుకు రూ. 1.60 కోట్ల నిధులు కూడా మంజూరు అయ్యాయని చెప్పారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, దస్తగిరి పేట ప్రాంత బాధితులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినికి ఉద్యోగం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో లో బిఏ డిగ్రీ పూర్తి చేసిన షేక్. కౌసర్‌కు భారతీయ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఉద్యోగంలభించినదని కళాశాల ప్రిన్సిపల్ సలీం బాష తెలిపారు. ఉద్యోగం పొందిన కౌసర్ కడప బ్రాంచ్‌లో ట్రైనింగ్ పూర్తి చేసి ప్రస్తుతం రాయచోటి బ్రాంచ్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా షేక్.కౌసర్‌ను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ గురు మోహన్ రెడ్డి, నాగవేణి, రవి శేఖర్ రెడ్డి, హరిత, జెకెసి మెంటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

'బాలికగా నాతోనే మార్పు'

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : బాలికలు ముందుగా తమ హక్కులపై అవగాహన కల్గి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, లక్ష్మీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 'బాలికగా నాతోనే మార్పు'అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడడుతూ బాలికలు హక్కులపై అవగాహన కలిగినప్పుడే జీవితంలో ఆటు, పోట్లను ఎదుర్కొని ముందడుగు వేసే దానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం తొమ్మిదో తరగతి బాలికలను సమావేశపరచి వారికి ఉన్న ప్రాథమిక హక్కులు విద్య, పోషకాహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహ నిషేధ చట్టం,సైబర్ సెక్యూరిటీ,చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి అవగాహన కలించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శోభ, అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

రేపు చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చింతాకొమ్మదిన్నె : ప్రత్యేక మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నామని చింతగమ్మదిన్నె మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కుళాయి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న నిర్వహించాల్సిన మండల సర్వ సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేశామని తెలిపారు బుధవారం ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సంబంధిత అధికారులు వారి ప్రగతి వివరాలతో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం 2026లో మరో డిఎస్‌సి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు లోకేష్ చిత్రపటాలకు రాష్ట్ర నిరుద్యోగ జెఎసి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్ధిక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకార విద్యాశాఖ మంత్రి లోకేష్ డిఎస్‌సి ప్రకటించి పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు. 16,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు, 2026లో మరో డిఎస్సీ ప్రకటిస్తామని చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కోచింగ్ సెంటర్ నిర్వాహకులు దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జెసి అధితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చక్రాయిపేట మండలం కుప్పం తాండకు చెందిన ఉపేంద్ర నాయక్ దాదాపు 300 మంది గిరిజనులు తాతము తాండలో నివసిస్తున్నామని తమ గ్రామంలో నెట్‌వర్క్ సరిగ్గా పని చేయడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కడప బాలాజీ నగర్‌కు చెందిన నరసింహారావు ఎస్ఓసి కోసం అర్జీల సమర్పించానని, త్వరతగతిన ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడమే లక్ష్యం

వైవీయూ నూతన విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్

దేశంలో ఉన్న 12 వందల విశ్వవిద్యాలయాలల నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్కు (ఎన్ఐఆర్‌ఎఫ్)లో మొదటి వందలోపు ర్యాంకులో మన విశ్వవిద్యాలయం నిలవాలని, న్యాక్ ఏ ప్లస్ గ్రేడు సొంతం చేసుకోవాలని ఆదిశగా మనమంతా శ్రమిద్దామని యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సోమవారం ఆయన వైవీయూ పరిపాలన భవనంలోని తన ఛాంబరులో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్, ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు, విద్యార్థులు నూతన ఉపకులపతికి పుష్ప గుచ్ఛాలు, దుశ్శాలువాతో స్వాగతం పలికారు. సాయంత్రం బోధనా, బోధనేతర సిబ్బందితో అయన క్యాంపస్‌లోని అన్నమాచార్య సెనెట్ హాల్లో సమావేశమయ్యారు. సమావేశంలో ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, డాక్టర్ మాదక్క, ముఖీనా బేగం, అధ్యాపకులు. బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవ ఎరువులను వినియోగించాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలోని తాడిగొట్ల గ్రామంలో రైతులలో జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు జీవ ఎరువుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ద్వారా జీవ ఎరువుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగం ద్వారా నేల సారాన్ని పెంపొందించడం, రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించడం, పర్యావరణహిత వ్యవసాయం సాధ్యమవుతుందనే విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ ఎన్. కృష్ణప్రియ, రైతులు పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్లకు అభినందనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్ సెంటర్, పచ్చిమర్హి, మధ్య ప్రదేశ్ రాష్ట్రం హిమాలయ వుడ్ బ్యాడ్జి ఫర్ స్కౌట్ మాస్టర్ క్యాంప్‌లో కడప జిల్లా నుంచి ముగ్గురు స్కౌట్ మాస్టర్లు బి.ఖాదర్‌బాష (స్కూల్ అసిస్టెంట్ - గంగిరెడ్డి పల్లి), యం.వెంకట సుబ్బయ్య (స్కూల్ అసిస్టెంట్ - చెన్నూరు), జె.బాల సుందరం (స్కూల్ అసిస్టెంట్ - పూసలవాడ) పాల్గొని వివిధ రకాల కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచారు. వీరికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహ రావు సర్టిఫికెట్లను, పచ్చిమెంట్, ఎస్ఓసి స్కౌట్ శ్రీనివాసరావు, ఎస్‌టిసి గైడ్స్ ఉమాదేవి ప్రదానం చేశారు. జాతీయస్థాయిలో నిర్వహించే క్యాంపును విజయవంతంగా పూర్తి చేసుకుని ఉత్తీర్ణత పొంది రాష్ట్రానికి విచ్చేసిన కార్యదర్శి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల స్కౌట్ మాస్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రుల కమిటీ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-కలసపాడు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఖరారు చేయడం, మార్గనిర్దేశం చేసేందుకు 10 మంది మంత్రుల సమూహ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని గ్రామ, వార్డ్ సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవాంర ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగోన్నతులపై ఏర్పాటు చేసిన కమిటీ కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా ఎక్కువ మందికి ఉద్యోగోన్నతి అవకాశం కల్పించాలని, సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌కు సమానం అయిన పే స్కేల్ ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల ఇంటి ఇంటి సర్వేల నుండి విముక్తి కల్గించాలని, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగోన్నతి కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మినీ అంగన్వాడీలకు ఉద్యోగోన్నతలు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో పనిచేస్తున్న మినీ అంగన్వాడీ వర్కర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల వేదికలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలమారెడ్డిపల్లె కొట్టాలలో పనిచేస్తున్న మినీ అంగన్వాడీ కార్యకర్తకు ప్రమోషన్ రాలేదని తెలిపారు. టక్కోలి, వెంకటాపురం, చాపాడు బి.మఠం, ఇలా అనేక ప్రాజెక్టులలో మినీ వర్కర్లకు ప్రమోషన్ రాలేదని చెప్పారు. దీనికి కారణం పదవ తరగతి పాస్ అయినట్లు రికార్డుల్లో నమోదు చేయకపోవడమేనని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రమోషన్లు వచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

సాధారణంగా క్లుప్తంగా సిపిఆర్ అని పిలువబడే కార్డియో పల్మోనరీ రీససిటేషన్ పై ప్రజలకు అవగాహన అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీకర్ పేర్కొన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో కార్డియో పల్మోనరీ రీససిటేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా గుండె ఆగిపోవడం లేదా మెదడుకు రక్తసరఫరా ఆగిపోవడంవల్ల వేలసంఖ్యలో మరణాలు సంభవిస్తున్నామయని చెప్పారు. వీటిలో చాలా మరణాలు మనం నివారించడానికి వీలైనవిగా ఉన్నాయన్నారు. గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు లేదా మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్త ప్రసరణ చేయలేనంత అసమర్థంగా కొట్టుకున్నప్పుడు దగ్గరలో ఉన్న ఎవరైనా రోగికి సిపిఆర్ చేయడం ద్వారా గుండె లేదా మెదడు చర్యలను పునరుజ్జీవింపచేయవచ్చని వివరించారు. గుండె ఆగిపోయి కొనఊపిరితో ఉన్న ఏవ్యక్తినైనా చూసినపుడు చుట్టు పక్కల ఉన్న సిపిఆర్ గురించి తెలిసిన వ్యక్తులు ఉన్నయెడల సదరు వ్యక్తిని ప్రమాదంనుండి కాపాడటానికి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆరోగ్య పర్యవేక్షకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఆన్‌లైన్‌లో భూమి వివరాలు తొలగించాలి

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని గొంటువారిపల్లె రెవెన్యూ పొలంలో 72/ 1 సర్వే నంబర్‌లో నడిపి చెన్న కృష్ణారెడ్డి అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని, దీనిపై విచారించి తొలగించాలని టిడిపి నాయకులు కొండా రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి దుగ్గిరెడ్డి కోరారు. సోమవారం స్పందన కార్యాక్రమంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు గొంటువారి పల్లె రెవెన్యూ పొలంలో 72/1 సర్వే నంబర్‌లో 48 సెంట్లు బ్రాహ్మణులకు చెందిన భతులూరి శకుంతలమ్మది అని, నడిపి చిన్న కృష్ణారెడ్డికి వారసత్వంగా ఎలా వస్తుందని పేర్కొన్నారు. అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకోవడమేగాక చెన్న కృష్ణారెడ్డి వెంటనే ఆయన కుమారుడైన ఆదినారాయణ రెడ్డికి రిజిస్టర్ చేయించారని తెలిపారు. గత నెల 27న ఈ భూమిని ఆన్‌లైన్ చెయొద్దని తహశీల్దార్‌కు అర్జీ రూపంలో విన్నవించామని, అయినా ఈనెల 7న బద్వేల్ రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్టర్ అయిందని వాపోయారు. దీనిపై వెంటనే కలెక్టర్‌ను కలిసి ఆన్లై తొలగించమని విన్నవించుకుంటామన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మైలవరం ఆయకట్టు రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మైలవరం జలాశయం ఆయకట్టు పరిధిలో ఉత్తర కాలువ కింద పాడైపోయి, కనుమరుగైపోయిన కాలువలు, ఉప కాలువలు, డ్రాపులు, కల్వర్టులు, పిల్ల కాలువలు, ఫీల్డ్ చానల్స్ మరమ్మతులు తిరిగి నిర్మించాలని మైలవరం ఆయకట్టు రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం నియోజకవర్గాలతో పాటు, కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 75 వేల ఎకరాల ఆయకట్టుకు, 85 గ్రామాలకు తాగునీరు, రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌కు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు 1979లో మైలవరం జలాశయాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. ఉత్తర కాలువ కింద సాగు నీరు అందించాల్సిన 50 వేల ఎకరాలకు ఏనాడూ నీరు అందించే పరిస్థితులు లేవని చెప్పారు. వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చూడాలని కోరారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగర అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి నగరంలోని రెండు ప్రాంతాల్లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఓంశాంతి నగర్ 17వ రోడ్డుతో పాటు ప్రకాష్ నగర్ విశ్వ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తూ, మౌలిక వసతుల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో 13వ డివిజన్ ఇన్‌చార్జ్ చిట్టి బోయిన సుబ్బరాయుడు యాదవ్, చక్రి, సూర్య, శ్రీనాథ్, దామోదర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉదయ్, దివాకర్, టిడిపి కార్యకర్తలు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని జడ్‌పి సమీపంలో ఉన్న ప్రేమాలయంలో టిడిపి మైనార్టీ నాయకులు అమీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం టిడిపి నాయకులు నాసర్‌అలీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆమూరి బాలదాసు, కొండా సుబ్బయ్య మీడియాతో మాట్లాడారు. పార్టీకి అండదండగా ఉంటూ, కష్టాల్లో ఉన్న కార్యకర్తలను అమీర్ బాబు ఆదుకున్నారని తెలిపారు. రావాల్సిన పదవులు ఆయనకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పార్టీ సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం చేస్తున్న వి.ఎస్.అమీర్‌బాబు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న జడ్‌పిటిసి లత

సిఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) భరోసానిస్తుందని జడ్‌పిటిసి మారెడ్డి లత పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 40 మందికి రూ.19,24,559 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆర్థిక స్తోమత లేక పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్య చికిత్స, అత్యవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వల్ల లబ్ధిదారుల కుటుంబాలకు కొంత ఊరట కలుగుతుందన్నారు. ప్రజల కష్టసుఖాలను అర్థం చేసుకుని ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌రెడ్డిని టిడిపి అధిష్టానం నియమించింది. పార్టీ ఆదేశాల మేరకు ఇటీవల ఆయా విభా గాల్లో మండల కమిటీలను నియమించింది. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గుర్తింపు తెచ్చుకున్న బిడ్డాలమిట్టకు చెందిన గంగధర్‌రెడ్డిని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ సోమవారం ఆదేశాలిచ్చింది. పార్టీకి పని చేసిన యువతను గుర్తించి పార్టీ పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందని గంగధర్‌రెడ్డి తెలిపారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఇసి సమావేశంలో బుక్కే రమేష్ నాయక్

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రమేష్ నాయక్

ప్రజాశక్తి - వేంపల్లె

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘంలో రాష్ట్ర స్థాయి ఇసి సభ్యులుగా వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెకు చెందిన బుక్కే రమేష్ నాయక్‌ను నియమించారు. విజయవాడలోని మాకేనేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆలిండియా బంజారా సేవా సంఘంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘంలో సభ్యుడిగా ఎన్నిక కావడం సంతోషంగా, గౌరవప్రదంగా ఉందన్నారు. గిరిజనుల అభ్యున్నతికి తాను చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పదవి అప్పగించారని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రస్థాయి ఇసి సభ్యుడిగా నియమించి ప్రోత్సహించిన అధ్యక్షులు రిటైర్డ్ డిఐజి డిటి నాయక్, చిన్న రాయుడు, బద్దు నాయక్, సంఘ అధ్యక్షులు చక్రి నాయక్‌కు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు వినతిపత్రమిస్తున్న ధృవకుమార్‌రెడ్డి

నదిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పాపాగ్ని నదికి వరద నీరు వస్తుండడంతో నీటి ప్రవాహం ఉందని, పిల్లలు, పెద్దలు నదిలోకి వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల సమన్వయకర్త మూలంరెడ్డి ధృవకుమార్‌రెడ్డి కోరారు. ఆ మేరకు సోమవారం వేంపల్లె పోలీసుస్టేషన్‌లో పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు పోలీసులకు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాగ్ని నదిలో ఎక్కువగా గుం తలు ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశంఉందన్నారు. నదిని చూడాలనే ఉత్సాహం, ఈత సరదాతో ప్రజలు, పిల్లలు వెళితే ప్రమాదమని వివరించారు. నదిలో గుంతలు ఉన్న చోట ప్రమాద సూచికను తెలియజేస్తూ, పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సూపర్ జిఎస్‌టి సభ ఏర్పాటు హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

కర్నూలులో ఈనెల 16న సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ పేరుతో భారీ బహిరంగ సభ జరపాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్రు కాల్చి వాతలు పెట్టి తర్వాత ఆయింట్‌మెంట్ రాసినట్లుంది మోడీ ప్రభుత్వం వైఖరి అన్నారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా 345 వస్తువుల ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. కొన్ని వాహనాల ధరలు, ఎలక్ట్రిక్ వస్తువుల ధరలు తగ్గాయి తప్ప, సామాన్యులు వాడే నిత్యవసర వస్తువులు ధరలు ఏమాత్రం తగ్గలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కర్నూల్‌లో 450 ఎకరాల్లో 6,321 బస్సులు ద్వారా 3లక్షల మంది పొదుపు మహిళలను, ఉపాధి కూలీలను సమీకరించి భారీ బహిరంగ సభ జరపడం అవసరమా అని తులసిరెడ్డి ప్రశ్నించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

డిఎస్‌సి-2025 ద్వారా నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకున్న ఉపాధ్యాయులంతా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి చక్కటి పనితీరుతో వన్నె తీసుకురావాలని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి కోరారు. ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, ఉర్దూ పాఠశాల విధుల్లో చేరారు. వీరికి ఎస్టీయు రూపొందించిన సర్వీస్ రూల్స్ ఫైల్స్‌ను సంగమేశ్వరరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలకు గుణాత్మక విద్య సాధనలో వృత్తి ధర్మాన్ని నిక్కచ్చిగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, శివ మునెమ్మ, పిజిటి అవ్వారు రమేష్, ఎస్టీయు నాయకులు లక్ష్మీ నరసింహ, ధర్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహబూబ్ బాషా, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, మస్తాన్ వల్లి, అక్బర్ బాషా, రాయుడు, సిరాజ్ పాల్గొన్నారు.

దిగుబడులు ఆశాజనకం.. ధరలు పతనం

చీనీ టన్నుకు రూ.20 వేలలోపే - పులివెందుల మార్కెట్ చరిత్రలో మొదటిసారి 500 టన్నులు

పులివెందుల మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్రస్థాయిలోనే బత్తాయి(చీనీ) తోట సాగులో వైఎస్ఆర్ జిల్లా ప్రసిద్ధి. జిల్లాలో పండిన చీనీ కాయలు అధిక రోజులు నిల్వ ఉండడంతో పాటు మంచి కాయ నాణ్యత, పరిమాణం సైతం బాగా ఉండడంతో బెంగళూరు, ఢిల్లీ తదితర మార్కెట్లలో సైతం మంచి డిమాండ్ ఉంది. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 54 వేల హెక్టార్లలో చీనీ సాగులో ఉంది. ఐదేళ్ల క్రితం టన్ను చీనీ కాయలు రూ.లక్షపైగా ధర పలికింది. ఈనేపథ్యంలో చాలామంది రైతులు బత్తాయి సాగుపై ఆసక్తి చూపారు. అప్పట్లో నాటిన మొక్కలు నేడు కాపునకు వచ్చి, మార్కెట్లలో ఎక్కువగా చీనీ కాయలు వస్తున్నాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు అనంతపురం మార్కెట్లో 500టన్నులు పైచిలుకు వస్తున్నాయి. అదేవిధంగా పులివెందుల మార్కెట్లో సాధారణంగా 300 టన్నుల వరకు వచ్చేవి. అలాంటిది ఇటీవల నుంచి పులివెందుల మార్కెట్ చరిత్రలో మొదటిసారి 556 టన్నులు వస్తున్నాయి. అర్థశాస్త్రం చెప్పిన విధంగా ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుతాయి అన్న ప్రకారం మార్కెట్‌కు అధికంగా కాయలు రావడంతో వ్యాపారులు గణనీయంగా ధరలు తగ్గించారు. ఈ ఏడాది సీజన్ కాయలకు సంబంధించి ఇప్పటివరకు రూ.20 వేలు టన్నుకు మంచి నాణ్యత, పరిమాణం కలిగిన కాయలు పులివెందుల మార్కెట్లో కొనుగోలు చేశారు.

పరిశ్రమల ఏర్పాటుతో గాడినపడే అవకాశం..

పులివెందుల ప్రాంతంలో చీనీ కాయలతో జ్యూస్ అనుబంధ పరిశ్రమ ఏర్పాటుతోనే రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తులైన పెప్సీ, కోకోకోలాతోపాటు ఇతర కూల్ డ్రింక్స్‌కు స్వస్తి పలికి చీనీ ఆధారిత జూస్ ఉత్పత్తులను వినియోగించాలని రైతుల కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని చీనీ రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు చెబుతున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి..

పులివెందుల ప్రాం తంలో చీనీ ఆధారిత జ్యూస్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. తద్వారా గిట్టుబాటు ధరలు లభిస్తాయి. కొంతమందికి ఉపాధి దొరుకుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- అరవిందనాథరెడ్డి, రైతు నాయకుడు,

ఎవరికీ ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు..

పులివెందుల మార్కెట్ యార్డ్ చరిత్రలో మొదటిసారి 500 టన్నులు పైచిలుకు చీనీ కాయలు వచ్చాయి. రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

- శ్రీధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ, పులివెందుల

సచివాలయ సిబ్బంది.. సమయానికి రారు మరి..!

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామపంచాయతీ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు, సుపరిపాలనను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ అపకీర్తి పాలవుతోంది. సచివాలయ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయానికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం ఉదయం ఖాజీపేట-2 గ్రామ సచివాలయ సిబ్బంది సమయానికి రాలేదు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు వారి రాక కోసం నిరీక్షించారు. గ్రామ సచివాలయ కార్యాలయ ఉద్యోగులు వారి ఇష్టానుసారం విధులకు హాజరవుతున్నారని ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఉదయం 10:30 అవుతున్నా విధులకు హాజరు కాకపోవడం నిర్లక్ష్యం కదా అని ప్రశ్నిస్తున్నారు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పలుమార్లు గ్రామ సచివాలయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, హెచ్చరికలు జారీ చేసినా సిబ్బందిలో ఏమాత్రం మార్పు రాలేదు. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన మండల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగుల విధులకు సంబంధించి వారి ఉద్యోగస్థాయి, శాఖ తెలిసేలా బోర్డులు ప్రదర్శించాల్సి ఉండగా అవేవీ లేవు. ప్రతిరోజు విధులకు యూనిఫాంలో రావాల్సి ఉండగా వాటిని కూడా పట్టిం చుకోవడం లేదు. గ్రామ సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టడం లేదని ప్రజలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు సమయపాలన పాటించని సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘ ప్రొద్దుటూరు శాఖ కార్యదర్శి సాల్మన్ కోరారు. ఆ మేరకు సోమవారం కార్మికులు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ కరోనా సమయంలో పనిచేసిన కార్మికులకు రెండు నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. వారికి కార్మికులకు రూ.3వేలు జీతం పెంచాలని అడిగారు. కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, యూనిఫామ్ మంజూరు చేయాలన్నారు. ఆప్కాస్ కార్మికులకు 60 ఏళ్లు రాకముందే తప్పుడు డేటా పంపించి పదవి విరమణ జరుగుతుందని వీటిని సరి చేయాలన్నారు. ఇలాంటి సమస్యను విజయవాడలో ఆప్కాస్ మేనేజర్‌తో మాట్లాడి పరిష్కరించుకుంటామన్నారు. ఆప్కాస్ కార్మికులకు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. అనారోగ్యంతో బాధపడే కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఆ మేరకు అర్జీ పెట్టుకున్నట్లు తెలిపారు. ఇలాంటి వారికి తొందరగా ఉపాధి కల్పించాలన్నారు. తమ సమస్యలన్నిటిని పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 17న ధర్నా చేయాల్సి వస్తుందని సాల్మన్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ పట్టణ అధ్యక్షులు చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, ఉపాధ్యక్షురాలు ప్రమీలమ్మ, రమాదేవి, మోహన్, ఓబయ్య పాల్గొన్నారు.

ఇనామ్ పద్ధతి రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మార్కెట్ యార్డ్‌లో బుధవారం నుంచి ఇనామ్ పద్ధతి అమలు చేస్తామని మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ అన్నారు. మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇనామ్ పద్ధతి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేశంలో ఉన్న మార్కెట్లో ఏ ధరలు వస్తాయో వాటి వివరాలు రైతులకు ఏరోజుకారోజు డిస్ ప్లే చేస్తామన్నారు. దేశంలో ఏ మార్కెట్లో ఉన్న వ్యక్తి అయినా పులివెందుల మార్కెట్లో కాయలు ఇనామ్ పద్ధతి ద్వారా కొనవచ్చు అన్నారు. ఈ పద్ధతిపై రైతులకు అపోహ ఉందన్నారు. అది సరైందికాదన్నారు. ఇనామ్ విధానం అమలు చేస్తే రైతులకు అధిక ధరలు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇనామ్ పద్ధతి ద్వారా వ్యాపారులు కుమ్మక్కయ్యే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అమర్‌నాథ్ యాదవ్

పగటి వేషధారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సంస్కృతి పరిరక్షకులు, పగటి వేషధారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సోమవారం పగటి వేషధారులను సత్కరించి, ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ పగటి వేషధారులను పూర్వం రాజులు, ఐశ్వర్యవంతులు ఆదరించే వారని గుర్తు చేశారు. నేడు వీరికి ఆదరణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ సంస్కృతిని కాపాడుతున్న పగటి వేషధారులకు తోడ్పాటు అందించడం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. భాగవతార ఎడవల్లి రమణయ్య, గండికోట శెక్షావలి పాల్గొన్నారు.

కెవికె ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం వనిపెంట కెవికె శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపై శ్రద్ధ చూపాలన్నారు. పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జీవాలు, కోళ్లకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ, ఈ కాలంలో వేయాల్సిన టీకాల గురించి వివరించారు. జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ టి.విజయ నిర్మల, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు శనగ విత్తనాలు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రబీ సీజన్ మొదలైందని, ఎరువులు చల్లి, విత్తనాల కోసం వేచి ఉన్న రైతులకు శనగ విత్తనాలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివకుమార్ కోరారు. శనగ విత్తనాల ధరను కూడా ప్రభుత్వం తగ్గించాలన్నారు. చాలామంది రైతులు విత్తనాల కోసం వేచి ఉన్నారని ఎఒ సుజనకు వివరించారు. ఆ మేరకు సోమవారం ఎఒకు వినతిపత్రమిచ్చారు. వైసిపి ప్రభుత్వంలో 40 శాతం రాయితీతో సకాలంలో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. రైతు భరోసా రూ.20వేలను ఒకేసారి ఇస్తే ఉపయోగం ఉంటుందని తెలిపారు.

ఆడపిల్లలను కాపాడండి

ప్రజాశక్తి - వేముల

వేముల కెజిబివి పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డాక్టర్ నాగరాజు ఆదేశాలు మేరకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే నినాదంతో డివై హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉషారాణి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడమగ ఇద్దరూ సమానమన్నారు. ఆడ పిల్లలకు సరైన ఆరోగ్యం, చదువు, అవకాశం కల్పిస్తే అన్నింటిలో మంచిగా రాణిస్తారన్నారు. కెజిబివి ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఆరోగ్య కార్యకర్త సుగుణ, ఆశ కార్యకర్త శివ పార్వతి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి సుస్థిర అభివృద్ధికి సంకేతం

ప్రజాశక్తి - వేంపల్లె

సుస్థిర అభివృద్ధికి స్వచ్ఛమైన గాలి ముఖ్యమైందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలో ర్యాలీ నిర్వహించారు. పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు అన్నారు. పర్యావరణ ప్రగతి-సుస్థిర అభివృద్ధి అన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేందుకు మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఓబులరెడ్డి, అధ్యాపకులు వినోద్, డాక్టర్ సుధాకర్, రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న సిబ్బంది

వైద్యులకు మద్దతుగా నల్లబ్యాడ్జీలతో సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని స్థానిక పిహెచ్‌సి వైద్యురాలు మహాలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ పెంచల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యులకు మద్దతుగా సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వంవెంటనే స్పందించి వైద్యుల సమస్యలను, ఆస్పత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులకు ప్రోత్సాహం, తగిన గుర్తింపును ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇఒ ఆధ్వర్యంలో కానుకలను లెక్కిస్తున్న సేవకులు

హుండీ ఆదాయం రూ.11.48 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన హుండీ కానుకల లెక్కింపును సోమవారం ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 6 నుంచి సోమవారం వరకు శాశ్విత హుండీల కానుకలను లెక్కించారు. రూ.11.48 లక్షలు నగదు, బంగారు 118 గ్రాములు, వెండి 1.800 కిలోలు వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. నగదును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మైదుకూరు బ్రాంచ్‌లో జమ చేశారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, సేవకులు, పోలీస్ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఎఒగా శ్వేతవాహనరెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఎంపిడిఒ కార్యాలయ పరిపాలనాధికారిగా శ్వేతవాహనరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పులివెందుల పిఐయూ సబ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై ముద్దనూరుకు వచ్చారు.

ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ఘనసత్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ధిరెడ్డి వెంకట జనార్దన్‌రెడ్డిని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించార. అదే పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు వెంకట జనార్దన్‌రెడ్డి ఎపి రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివ మునెమ్మ మాట్లాడుతూ గతేడాది పాఠశాలలో రాష్ట్ర ఆర్చరీ ఈవెంట్ ఘనంగా నిర్వహించారని చెప్పారు. విలు విద్య అనేది ఈ ప్రాంత వాసులకు జనార్దన్‌రెడ్డి పరిచయం చేశారన్నారు. పురాణాల్లో విలువిద్య ఎంతో ప్రావీణ్యాన్ని సంపాదించిన క్రీడ అన్నారు. ఆర్చరీ ఈవెంట్‌లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసి వారిని రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు జగదీష్ బాబు

ఘనంగా ఆలూరు జగదీష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జనసేన నాయకుడు ఆలూరు ముని జగదీశ్‌బాబు రాయల్ 35వ జన్మదిన వేడుకలను సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీకి చెందిన మహేశ్వర్‌రెడ్డి వేలూరు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, అక్కడ ఉన్న అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో హరీష్ రాయల్, విజయ్ రాయల్, విద్య రాయల్, ప్రసాద్, నవీన్, పఠాన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 105/2021

ఉప్పర వెంకట రామమూర్తి, S/o యు.వెంకటస్వామి, 63 సం॥లు, హిందూ, బిజినెస్, డోర్‌నెం.5/225, విజయనగరం వీధి, ప్రొద్దుటూరు, కడప జిల్లా. **...వాది**

Vs

4. ఉప్పర జయప్రకాష్, S/o వెంకటేశ్వర్లు 38 సం॥లు హిందూ డోర్‌నెం.17/577, ఆకులవారి వీధి, నడింపల్లి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
6. ఉప్పరదేవి, W/o లేట్ శ్రీనివాసులు, 54 సం॥లు, హిందూ, డోర్‌నెం.6/330, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

...4,6వ ప్రతివాదులు

దావా సమను మరియు నోటీసు

పై నెంబరు దావాను ప్రతివాదులపైన భాగపరిష్కారం కొరకు దావా దాఖలు చేయడమైనది. మరియు I.A.No. 1010/2022 నెంబరు గల ఇంజక్షన్ పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నాము. అట్టి దావాలో మరియు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు/4వ ప్రతివాది అయిన ఉప్పర జయప్రకాష్, 6వ రెస్పాండెంటు/6వ ప్రతివాది అయిన ఉప్పరదేవి అయిన మీరు పై కోర్టులో 30.10.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 30.10.2025

//By Order of the Court//

A.S.VENKATA RATHNAM
Advocate, Proddatur.

IN THE COURT OF THE HON'BLE 3RD ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

E.P.NO : 110 OF 2024 IN

O.S.NO : 75 OF 2022

SHAIK MASTANGARI MOHAMMED RAFI, Son of S. Ghouse Saheb, Muslim, Door No:1/145, Main Bazaar, Kondapuram (Vi & Mandal) Kadapa District, now residing at door No: 3/2039, Scion puram, Kadapa City. **...Petitioner/D.Hr.**

Vs

PATAN MUSTAF ALI KHAN, Son of P.Sattar Khan, Muslim, aged about 48 years, Working as Helper at APSRTC Garage, Kadapa and residing at Door No: 43/114-7A-1, Prakash Nagar, Kadapa city, AVAILABLE at Door No:3/647, Raja Reddy Street, Kadapa City. **...Respondent/J.Dr.**

NOTICE TO RESPONDENT/J.DR UNDER ORDER 21 RULE 48 C.P.C

Where as the Petitioner/D.Hr filed the E.P against you being the J.Dr to realize the E.P amount by way of attachment of salary and the said E.P stand posted on 23-10-2025 for your appearance therefore you being J.Dr. here by instructed to appear before the Hon'ble court on 23-10-2025 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & P.ABBAS KHAN
Advocate for Petitioner/D.Hr.